# 8. ఆశాజీవి

వాకిట్లో వాల్చున్న కుక్కిమంచంలో వెల్లకిలా పడుకున్నాడు తిరుపతయ్య. అనంతమైన ఆకాశంకేసి దీనంగా చూస్తున్నాడు. ఇప్పుడతనికి ఆకాశమే ఇల్లు. కడుపులో కడవలకొద్దీ దుఃఖం. ఏడ్చి ఏడ్చి కళ్ళనుండి నీళ్లురావడం ఆగిపోయాయి. శూన్యమయిన ఆకాశంలా తన బ్రతుకంతా శూన్యంగానే అగుపడుతుంది. ప్రక్కలకు చూసాడు. కూలిపోయిన ఇంటి మొండిగోడలు దయ్యాల్లా దర్శనమిచ్చాయి. ప్రకృతిమాత ప్రళయగర్జనలో మొండి మాత్రినులా మిగిలిన తననుతానే చూసుకొన్నాడు. తన కష్టమయ జీవితం అతని కళ్ళముందు దర్శనమిచ్చింది. ఇల్లు కోల్పోయిన్నాటి భయంకర దృశ్యం, ఇల్లాలుని కోల్పోయిన్నాటి హృదయవిదారక దృశ్యం అతని మనోఫలకంపై సినిమా బొమ్మల్లా పడసాగాయి. అతని బండబారిన జీవితం తాలూకు జ్ఞాపకాలు అతని స్మృతికొచ్చాయి.

చిన్నప్పట్నుంచీ తన జీవితం కష్టాల్లోనే గడిచింది. దొర పాలేరుగా, కూలీగా, ఎన్నో తిప్పలు పడ్డాడు. దినమంతా కష్టించినా కడుపుకూడా నిండని కూలి. పైగా యజమానులతో తిట్లు, అవమానాలు. మరోదిక్కు త్రాగుబోతైన తండ్రి. అతను చనిపోయేనాటికి ఉన్న ఒక్క ఇల్లునుకూడ కుదువబెట్టిపోయాడు. అయింతిల్లుపోతే తాను బజార్లో నిలబడాల్సిందే. తండ్రిపోయిన ఏడాదికి రంగమ్మ తన జీవి

—కాలువ మల్లయ్య

తంలో ప్రవేశించింది. సముద్రంలో కొట్టుకుపోతున్న వాడికి పడవలా ఆమె తనకు చేదోడయింది. తాను, భార్య రాత్రిం బవళ్ళు కష్టపడి, అష్టకష్టాల నెదుర్కొని బొక్కలు కలికలి గాంగ చెమటోడ్చి ఒకపూట తిని, తినక కొంత డబ్బు కూడ బెట్టి తండ్రి కుదువబెట్టి నింటిని విడిపించుకున్నారు. చెరో కష్టంచేస్తూ ఎలాగో కాలం గడుపుతున్నారు. తమ కిద్దరు పిల్లలు కలిగారు. పెద్దవాన్ని చదివించలేకపోయారు. వాడు చేతికందొస్తున్నాడు. ఎన్ని కష్టాలుపడైనా చిన్నకొడుకును చదివించాలని నిర్ణయించుకున్నారు. పిల్లలు జ్ఞాపకానికొచ్చి తిరుపతయ్య కళ్ళు చెమర్చాయి.

ఆరాత్రి తమపాలిట కాళరాత్రి అవుతుందని, చేతి కందిన కొడుకును, ఏళ్ళతరబడి కష్టించి నిలుపుకున్న ఇల్లును నేలమట్టం చేస్తాయని తానెన్నడు ఊహించలేదు. నాలుగైదు రోజులుగా ఎడతెరపిలేకుండ వర్షాలు కురుస్తున్నాయి. కొంత సేపు కుండపోతగా, కొంతసేపు తుంపరగా పడుతున్నాయి. నాల్గు రోజులనుండి సూర్యరశ్మి చూసి ఎరుగరు. ఇంటికప్పు ఉరుస్తున్నది. ఉరిసేచోట్ల చెంబులు, గిన్నెలుపెట్టి చలికి గజ గజ వణకుతున్నారు. తాతలనాటి ఇల్లును బాగుచేయించు దామనుకొంటుండగానే వర్షాకాల మొచ్చింది. వంట వండు కొనుటానికి పొయ్యిల కట్టెల్లేవు. బయటఉన్న పిడుకలు తడిసినవి. వానరాకముందు ఇంట్లో వేసుకున్న గంపెడు పిడుకలతోనే వెళ్లదీసుకొంటున్నారు. బయటకు అడుగుపెడితే

బురద. కయికిలిలేదు. ఏపనీ చేయకుండా ఖాళీగా కూర్చో
వడం బాధగా ఉంది. అయినా ఏమీ చేయలేని స్థితి. ఈ
వానెప్పుడు వెలుస్తుందో తామెప్పుడు బయటకెళ్ళి కూలి
చేసుకుంటామోనని చూస్తున్నాడు తిరుపతయ్య. రాత్రి అన్నం
తిని తాను, పెద్దకొడుకో మంచంలో, రంగమ్మ, చిన్నకొ
డుకో మంచంలో పడుకొన్నారు. వర్షం ధారాపాతంగా
కురిసి ఇపుడు తుంపరపడుతుంది. తాను మూత్రానికని
బయటుకొచ్చాడు. ఇంతలో చక్ చర్ మని మూలవాసం
విరిగిన చప్పుడయింది. రంగమ్మ అరుచుకొంటూ చిన్నకొ
డుకుతో బయకొచ్చింది. గాఢ నిద్రలోనున్న పెద్దకొడుకు
లేవలేదు. పెద్దకొడుకును తీసికొని రావడానికి లోపలికిపో
బోయిన తిరుపతయ్యకడపదగ్గరే ఆగిపోయాడు. కప్పు కూలి
మంచంపై పడ్డది. ప్రక్కలకున్న గోడకూడ కూలింది. నోరు
తెరిచే అవకాశం లేకుండానే పెద్దకొడుకు ఈ లోకాన్ని
వదిలి వెళ్ళాడు. తాను, భార్య ఏడ్చిన హృదయవిదారక
మైన ఏడుపు తిరుపతయ్యకు జ్ఞాపకమొచ్చింది. ఏండ్ల తర
బడి శ్రమించి దక్కించుకొన్న ఇల్లు ప్రకృతి వికటాట్టహా
సానికి నేలమట్టమయింది. చేతికెదిగిన కొడుకు మరణిం
చాడు. తాము మొత్తుకొన్నారు- కొట్టుకున్నారు. గుండెలవి
సేలా దుఃఖించారు. దేవుళ్ళను పేరుపేరునా తిట్టారు. తామేం
చేసామని తమ కింత శిక్ష? తామెవరికి ద్రోహం చేసామని
తమ కిన్ని కష్టాలు? అని విలపించారు. ఇసుగుపొరుగు ఓదా

ర్పు నూటలకు తమకు మరింత దుఃఖమొచ్చింది. మరో రెండు రోజులు వర్షాలు విలయతాండవంచేసి వెలిసాయి. జనాలు కొంచెం ఊపిరి పీల్చుకొన్నారు. తిరుపతయ్యలాగ ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. సర్వం హరించుకుపోగా వాకిట్లో పందిరిలా వేసుకొని కాలం గడుపుతున్నాడు తిరుపతయ్య.

ఎవరెవరో తెల్లబట్టలవాళ్ళొచ్చారు. ఖద్దరు బట్టల వాళ్ళొచ్చారు. అన్నీ చూసారు. సానుభూతి తెలిపారు. సాయం చేస్తామని చెప్పారు. ఐనా తమకొరిగిందేమీ లేదు.

నెలరోజులు గడిచాయి. తక్కువయ్యాయనుకొన్న వర్షాలు మళ్ళీ మొదలయ్యాయి. ఈసారి చెర్లూ కుంటలూ నిండి మత్తళ్ళు పడుతున్నాయి. అన్ని వాగులూ, ఏరులూ పరవళ్ళు త్రొక్కుతూ పారుతున్నాయి. తానెప్పుడూ చూసెరుగని వర్షాలు, ఈ ప్రాంతంలో తన నలబై యేళ్ళ జీవితంలో ఎప్పుడూ చూడని కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఆ రోజు వర్షం వెలిసింది. తిరుపతయ్య కుటుంబం పందిరి క్రింద పడుకున్నారు. తాను, భార్య, కొడుకు గాఢ నిద్రలో ఉన్నారు. ఇంతలో పక్కకు నీళ్ళు తగిలాయి. గజ్జన వణికి తాను లేవబోయాడు. ఎక్కడినుంచివచ్చిందో ఒక ప్రవాహం తనను లేపుకపోయింది. వరదలో కొట్టుకుపోతున్న భార్య కంఠధ్వని వినిపిస్తుంది. హృదయవిదారకంగా అరుస్తుంది. ఆ అర్ధరాత్రి కటిక చీకటిలో కొడుకేమయిందో తెలియడం

లేదు. తాను కొట్టుకుపోయి ఒక చెట్టుకు తట్టుకొని ఆగాడు. చెట్టును గట్టిగా పట్టుకొని పైకి పాకాడు. కొడుకెలాగో ఒక గడ్డపై చిక్కుకొన్నాడు. తెల్లవారి భార్య మృతదేహం రెండు మైళ్ళ దూరాన కనబడింది.

అంతులేని ప్రవాహ వేగానికి చెరువుకు గండిపడింది. కట్ట తెగిపోయింది. చెర్లనీళ్ళన్నీ బయటుకొచ్చాయి. లోతట్టు ప్రాంతంలో ఉన్న తనలాంటివాళ్ళ సంసారాలు బుగ్గయ్యాయి ఆ వూళ్ళో ఏడెనిమిది మంది చనిపోయారు.

మొదటి వర్షాల్లో ఇల్లునూ, కొడుకునూ కోల్పోయాడు. రెండవసారి వర్షాల్లో ఇల్లాలిని కోల్పోయాడు. ప్రకృతి విలయతాండవానికి చిత్తైపోయిన తిరుపతయ్య ఇల్లునూ, ఇల్లాలినీ కోల్పోయి జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాడు. బ్రతికున్న ఒక్క కొడుకునూ అత్త వచ్చి తీసికెళ్ళింది.

తర్వాత ఎంతోమంది గవర్నమెంటోళ్ళు వచ్చారు. ఎన్నో ప్రకటనలు చేసారు. కన్నీళ్ళు కార్చారు. సాయం చేస్తామన్నారు. సహాయంగా తనకు రెండువందల రూపాయలు, పాతబట్టలు ఇచ్చారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు సహాయంచేసినా అది కష్టాల కడలిలో నీటిబొట్టులాంటివే.

గతాన్ని జ్ఞాపకం చేసికొన్న తిరుపతయ్య కళ్ళలో శ్రావణమేఘాలు జలజలకారే కన్నీటిని రుమాలుతో తుడుచుకొన్నాడు. లేచి మంచంలో కూర్చున్నాడు.

గతమంతా అంతంలేని కష్టాల కడలిలోనే గడిపాడు.

—కాలువ మల్లయ్య

గతం భయంకరంగా భయపెడుతుంది. వర్తమానం శూన్యంగా అగుపడుతుంది. అతడు ఆత్మహత్య చేసికోవాలని అనుకొన్నాడు కాని భవిష్యత్తన్నా అభయహస్తమిస్తుందోనన్న ఆశ. తన కొడుకు పెద్దవాడై పైకొస్తాడని, తమ కష్టాలకు అంతిమ గీతం పాడుతాడని ఎక్కడో మినుకు మినుకుమంటూ ఆశ. తానెన్ని కష్టాలనుభవించినా కొడుకు భవిష్యత్తుకై పూలబాట వేయాలన్న ఆరాటం. కొడుకు భవిష్యత్తుపై, మొత్తం భవిష్యత్తుపై ఏదో తనకే తెలియని ఆశ. భవిషత్తుపై ఆశతోనే తిరుపతయ్య జీవించాలని నిర్ణయించుకొన్నాడు. గతం- వర్తమానం ఎంత చేదుగా ఉన్నా భవిష్యత్తుపై ఆశేలేకుంటే ఎంత మంది తిరుపతయ్యలాంటి నిర్భాగ్యులు మట్టిపాలయ్యేవారో- అందుకే మనిషి ఆశాజీవి.

(రచ్చబండలో ముద్రితము)

## 9. మాతృమూర్తి

ఈమధ్య చాలారోజులయింది కలంపట్టి. మనస్సు కాస్త ఉల్లాసంగా ఉంటే కలం, కాగితం చేతబట్టుకొని కుర్చీలో కూర్చున్నాను. మనసులో ఎన్నెన్నో ఆలోచనలు గజిబిజిగా అల్లుకుంటున్నాయి. తీరా కలంతెరిచి అక్షరరూపంలో పెడ్తామంటే ఏంపెట్టాలో ఎలా పెట్టాలో అర్థంకావటంలేదు. కథావస్తువుకొరకు దీర్ఘాలోచనామగ్నుడనై యున్ననాకు ప్రక్క